వంతెనల నిర్మాణం జరిగేనా?

- వర్షాకాలంలో వాగులు పొర్లడంతో రాకపోకలకు అంతరాయం
- ఆయా గ్రామాల ప్రజలకు తప్పని దూరభారం
- పట్టించుకోని అధికారులు


కొమరబండ వాగుపై ఇబ్బంది పడుతున్న వాహనదారుడు

షాబాద్: మండల పరిధిలోని కొమరబండ, రేగడిదోస్వాడ, మీరాపూర్, నరెడ్లగూడ, చర్లగూడ గ్రామాల మధ్య వంతెన నిర్మాణాలు కలగానే మిగిలిపోయాయి. ఐదు గ్రామాల మధ్య ఉన్న వాగులు వర్షాకాలం వచ్చిందంటే పొంగిపొర్లుతాయి. దీంతో ఆయా గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. అంతేగాక ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లి తిరిగి రావాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

తప్పని దూరప్రయాణం..

కొమరబండ, మీరాపూర్, చర్లగూడ, నరెడ్లగూడ, రేగడిదోస్వాడ వాగులపై వంతెనలు లేకపోవడంతో వివిధ గ్రామాలకు చెందిన గ్రామస్తులు, విద్యార్థులు, వివిధ పనుల నిమిత్తం షాబాద్ మండల కేంద్రానికి వెళ్లాలంటే 15కిలోమీటర్లు తిరిగి ప్రయాణించాల్సి వస్తోంది. దీంతో వాహనదారులకు అదనపు భారం పడుతుండడమే కాకుండా సమయం వృథా అవుతోంది. కాగా ఐదు గ్రామాల మధ్య ఉన్న వాగులపై వంతెన నిర్మాణాలు చేపట్టాలని గతంలో ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో వచ్చి బ్రిడ్జి నిర్మాణాలు చేస్తామని హామీలు ఇచ్చి ఎన్నికలు పూర్తయిన తర్వాత పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇకనైనా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు, అధికారులు చొరవ చూపి వంతెన నిర్మాణాలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంతెనలు నిర్మించాలి



ప్రజా అవసరాల దృష్ట్యా ఎన్నో అభివృద్ధి పనులు చేస్తున్న ప్రభుత్వం వంతెన నిర్మాణాల్లో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుంది. ఎన్నికలప్పుడు ఏవేవో మాటలు చెప్పి ఓట్లు వేయించుకునే నాయకులు ఎన్నికల తర్వాత ఇటు వైపు రావడమే లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే యాదయ్య చొరవ చూపి వంతెన నిర్మాణాలకు కృషి చేయాలి.

– సుభాష్, కొమరబండ, షాబాద్

నిధులు మంజూరు చేయాలి



వర్షాకాలంలో కొమరబండ, రేగడిదోస్వాడ, మీరాపూర్, నరెడ్లగూడ, చర్లగూడ వాగులు పొర్లడంతో ఆయా గ్రామాల రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఐదు గ్రామాల మధ్య ఉన్న వాగులపై బ్రిడ్జిలు నిర్మిస్తే సమస్య తీరుతుంది. అధికారులు స్పందించి బ్రిడ్జి నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలి.

– విఠలయ్య, తిర్మలాపూర్, షాబాద్

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి


మాట్లాడుతున్న విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు

షాద్‌నగర్: ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాయమాటలు చెప్పి ఓట్లు వేయించుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఆరుగ్యారంటీల పేరుతో ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి పెట్టుబడి కోసం రైతు భరోసా ఎంత మందికి ఇచ్చారని ప్రశ్నించారు. ఎన్నికల నినాదం కోసమే కాంగ్రెస్ పార్టీ నేతలు లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌ను వాడున్నారన్నారు. షాద్‌నగర్ ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న చటాన్‌పల్లి రైల్వే ఫ్లైఓవర్ నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయని, త్వరలో ప్రత్యక్ష పోరాటం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు మోహన్‌సింగ్, లష్కర్ నాయక్, ఇస్నాతి శ్రీనివాస్, శ్యాంసుందర్‌రెడ్డి, మఠం రుషికేశ్, సుధాకర్, ఎదిర రాజు, గణేశ్, నరేందర్‌రెడ్డి, కిషన్ నాయక్, మహేందర్‌రెడ్డి, రంగన్నగౌడ్, రాజునాయక్, ఆంజనేయులు, ఆకుల శ్రీను, రాజునాయక్, గణేశ్‌నాయక్ పాల్గొన్నారు.

కులగణన చరిత్రాత్మకం

- కేబినెట్ ఆమోదం హర్షణీయం
- బీసీ సెల్ షాద్‌నగర్ నాయకులు


పీసీసీ అధ్యక్షుడిని సన్మానిస్తున్న నాయకులు

షాద్‌నగర్: కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన కులగణన చరిత్రాత్మకమని బీసీ సెల్ తాలూకా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. కుల గణనను కేబినెట్ ఆమోదించిన సందర్భంగా బీసీ సెల్ స్థానిక నాయకులు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నూతి శ్రీనివాస్‌గౌడ్‌ను కలిసి అభినందనలు తెలిపారు. అనంతరం వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ.. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందన్నారు. సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించి వివరాలు వెల్లడించలేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హయాంలో ఈ ప్రక్రియ పూర్తవడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరమణ, పెంటయ్య, శ్రీధర్, వెంకటేశ్, బసప్ప, మల్లేశ్, గోవర్ధన్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత


విద్యార్థులతో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, నాయకులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని శంకర్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక బాలుర, బాలికల, అయ్యప్పరెడ్డి గూడెంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు మంగళవారం మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి పరీక్ష సామగ్రి అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు బాగా చదువుకొని, జీవితంలో ఉన్నత శిఖరాలను అందుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, గోపాల్‌రెడ్డి, పాండురంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలి

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్


కమిషనర్‌ను సన్మానిస్తున్న మాజీ సర్పంచ్ సంధ్య, తదితరులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో గల మున్సిపల్ కార్యాలయంలో మాజీ సర్పంచ్ బండ్లగూడ సంధ్యాశ్రీశైలం గ్రామస్తులతో కలిసి కమిషనర్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో అల్లం మాణిక్‌రెడ్డి, మాడి రాంచంద్రరెడ్డి, చంగలి వెంకట్‌రెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, రఘుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు సన్మానం


కమిషనర్ సునీతకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన సునీతను మంగళవారం కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జమృద్‌ఖాన్ ఆధ్వర్యంలో నాయకులు, 10వ వార్డు ప్రజలు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. సమస్యల పరిష్కారానికి కావాల్సిన చర్యలను చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులుయాదవ్, బాలస్వామియాదవ్ పాల్గొన్నారు. అదేవిధంగా మాజీ మహిళా కౌన్సిలర్లు కమిషనర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. పట్టణంలోని వివిధ కాలనీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ మహిళా కౌన్సిలర్లు అగ్గనూరు విశాలవిశ్వం, లతశ్రీ శ్రీశైలంగౌడ్, కృష్ణవేణి, నడికూడ సరిత యాదగిరియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ కమిటీ ఎన్నిక


నూతన కమిటీని సన్మానిస్తున్న యూనియన్ సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) మండపం వద్ద మంగళవారం ఆటో యూనియన్ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ సభ్యుల సమక్షంలో యూనియన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షుడిగా పవన్, ఉపాధ్యక్షులుగా సంతోష్, శ్రీశైలం, ధనరాజ్, ప్రధాన కార్యదర్శిగా చెన్నయ్య, కోశాధికారిగా అల్లాడ శేఖర్, సహాయ కోశాధికారిగా సురేశ్, జాయింట్ సెక్రటరీలుగా సాయి, మహేశ్, సామ్రాట్, గౌరవ సలహాదారులుగా షేక్‌అయూబ్, శ్రీనివాస్‌తో పాటు సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడు పవన్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నింబంధనలను పాటించడంతో పాటు ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా మెలగాలని సూచించారు. అనంతరం నూతన కమిటీ సభ్యులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు భాస్కర్, కిషన్‌నాయక్, వీరేశ్, విగ్నేశ్, సంతోష్, పాషా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాయకులు

కాంగ్రెస్‌తోనే దళితుల అభ్యున్నతి

పార్టీ ఎస్సీ సెల్ నాయకులు సురేందర్, జగన్

షాద్‌నగర్: గత పాలకులు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను మింగేశారని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే దళిత, గిరిజనుల అభ్యున్నతి జరుగుతుందని పార్టీ ఎస్సీ సెల్ నేతలు కరోళ్ల సురేందర్, ఎర్రోళ్ల జగన్, జాంగారి రవి, నాగి సాయిలు, అనిల్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ నాయకులు ఎస్సీ సబ్ ప్లాన్ కోసం కేటాయించిన నిధులను మింగేశారని ఆరోపించారు. 2013లో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి సబ్‌ప్లాన్ తీసుకొచ్చారన్నారు. దీని ప్రకారం జనాభా ప్రాతిపదికన దళిత, గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రత్యేక నిధులు కేటాయించేలా చట్టం తీసుకొచ్చారన్నారు. అయితే గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రాజెక్టులకు మళ్లించిందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం పేరుతో గత పాలకులు నిధులను స్వాహా చేశారని ఆరోపించారు. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని, ఇందులో భాగంగా షాద్‌నగర్ నియోజకవర్గానికి సుమారు 10 కోట్లు కేటాయించారన్నారు. సమావేశంలో నాయకులు సింగపాగ అనిల్‌కుమార్, ఎంకనోళ్ల శివ, జాంగారి జంగయ్య, ప్రభు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు


షాద్‌నగర్: పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

షాద్‌నగర్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచ్‌లు తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి వెళ్లనీయకుండా మంగళవారం ఉదయమే పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు మాజీ సర్పంచ్‌లు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధికి సొంత నిధులు వెచ్చించామని, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని ఎంతో కాలంగా డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వం పోలీసులతో అక్రమంగా అరెస్టులు చేయించి ఉద్యమాన్ని అడ్డుకోలేదన్నారు. అరెస్టు అయిన వారిలో మాజీ సర్పంచ్‌లు పల్లె శ్రీనివాస్‌రెడ్డి, సాయియాదవ్, లింగం తదితరులు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

కేశంపేట: పెండింగ్ బిల్లులు చెల్లించాలనే డిమాండ్‌తో తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి వెళ్లనీయకుండా మండలంలో మాజీ సర్పంచ్‌లను పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో కేశంపేట, ఇప్పలపల్లి, కొత్తపేట గ్రామాల మాజీ సర్పంచ్‌లు తలసాని వెంకట్‌రెడ్డి, ఆంజనేయులు, కమ్మెకర్ నవీన్‌కుమార్ ఉన్నారు. తమకు రావాల్సిన బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం వారిని సొంతపూచీకత్తుపై విడుదల చేశారు.

కులగణనను తిరస్కరిస్తున్నాం

- అన్ని రంగాల్లో బహుజనులను అణిచివేసేందుకు కుట్ర
- బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్

షాద్‌నగర్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పేరుతో చేసిన గణాంకాలు పొంతన లేకుండా ఉన్నందున కుల గణనను తిరస్కరిస్తున్నామని బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి దొడ్డి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 2014లో అప్పటి సీఎం కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన కుటుంబ సమగ్ర సర్వే పేరుతో చేసిన గణాంకాలకు, సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం చేసపట్టిన గణాంకాలకు పొంతన లేకుండా ఉందని ఆరోపించారు. విద్య, ఉపాధి, ఆర్థిక, రాజకీయ, సామాజిక రంగాల్లో బీసీ, మైనార్టీలను అణిచివేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తూతూమంత్రంగా సర్వే చేపట్టి 85 శాతం ఉన్న బహుజనులకు తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయ వాటాలను పెంచే ఉద్యమాలను బలోపేతం చేయడానికి ముందుకురావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఎస్పీ నాయకులు శ్రీనివాస్, కుమార్, మహేందర్, ఆంజనేయులు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణం చేపట్టొద్దని వినతి


కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందిస్తున్న వెంచర్ వాసులు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని బొప్పన్న వెంచర్‌లో మంచినీటి ట్యాంకు నిర్మాణం చేపట్టొద్దంటూ మంగళవారం వెంచర్ వాసులు మున్సిపల్ కమిషనర్ యోగేశ్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2004లో బొప్పన్న వెంచర్ డీటీసీపీ అనుమతితో లేఅవుట్ అయ్యిందని, అయితే వెంచర్ ఏర్పాటు సమయంలో అంతర్గత మురుగునీరు అంతా పార్కు స్థలంలోనే అండర్ గ్రౌండ్ ట్యాంకులోకి వెళ్లేలా ప్లాన్ చేశారన్నారు. కానీ కొన్నిరోజుల క్రితం అమృత్ 2.0 పథకం కింద ఈ పార్కు స్థలంలోనే మంచినీటి ట్యాంకు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు ప్రణాళికలు రూపొందించి, మంగళవారం పనులు ప్రారంభించారు. కానీ జేసీబీతో గుంతలు తీస్తుండగా.. లోపల నుంచి మురుగునీరు బయటకు వస్తుండడంతో వెంచర్‌వాసులు గమనించి పనులను అడ్డుకొని, మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన సానుకూలంగా స్పందించి, ఒకటి, రెండు రోజుల్లో డీఈ, ఏఈలతో పరిశీలించి, తదుపరి చర్యలు తీసుకుంటామని, అప్పటివరకు పనులను నిలిపివేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాజేందర్‌రెడ్డి, వెంకట్‌చారి పాల్గొన్నారు.

ప్రజాసంక్షేమమే బీజేపీ ధ్యేయం

పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య


షాద్‌నగర్: ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు


చేవెళ్లలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, నాయకులు

షాద్‌నగర్: దేశాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా బడ్జెట్‌ను ప్రవేశపెట్టినందుకు మంగళవారం పట్టణ చౌరస్తాలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు హరిభూషణ్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి బీజేపీ నేతలు క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన బాబయ్య మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతితో పాటుగా, దేశాభివృద్ధే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఈ బడ్జెట్‌పై అన్ని వర్గాల ప్రజల నుంచి హర్షం వ్యక్తం అవుతుంటే ఇది చూస్తున్న కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఓర్వలేపోతున్నారని విమర్శించారు. హామీల అమలును మరిచి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్చలం మురళీ, పిట్టల సురేశ్, నర్సింలు, మంగ విజయ్, మల్చలం రాము, విజయ్, శ్రీనాథ్, రామకృష్ణ, మణికంఠ, ఆంజనేయులు, రవినాయక్, నందు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధికి నిరంతరం కృషి

చేవెళ్ల: రాబోయే రోజుల్లో దేశాన్ని ప్రపంచంలోనే గొప్ప ఆర్థిక వ్యవస్థ కలిగిన దేశంగా నిలిపేలా పీఎం మోదీ కృషి చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల నాయకుల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా రంజక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన సందర్భంగా మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి పట్టణ కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దేశంలో పేదరిక నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. దేశాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతిపక్ష పార్టీలు ఈ బడ్జెట్‌ను చూసి జీర్ణించుకోలేక లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. బడ్జెట్‌పై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, మండల అధ్యక్షుడు అత్తెల్లి అనంత్‌రెడ్డి, యువ నాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, జిల్లా నాయకులు వెంకట్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా బడ్జెట్

కొందుర్గు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆర్థికాభివృద్ధికి తోడ్పడేలా ఉందని బీజేపీ మండలాధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గులో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను చూసి ప్రతిపక్షాలు మతి తప్పి మాట్లాడుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేతనైతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాయకులు శివారెడ్డి, శ్రీశైలం, ప్రశాంత్, అశోక్, శ్రీను, రఘునాథ్‌రెడ్డి, రవి, రామచంద్రయ్య, సత్తయ్య, శివరాములుగౌడ్ పాల్గొన్నారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కేశంపేట: దేశంలో సమన్యాయం పాటిస్తూ బడ్జెట్‌ను ప్రవేశపెట్టడంపై మండల బీజేపీ నాయకులు మండల కేంద్రంలో మంగళవారం పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షురాలు రొల్లు రాధిక, రఘురాంగౌడ్, నర్సింహ, అంజయ్య, ఉదయ్‌గౌడ్, యుగేంధర్, నర్సింలు, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామివారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని శ్రీబాలాజీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో సప్తవాహన సేవలను ప్రజలు భక్తిశ్రద్ధలతో ఊరేగించారు. సప్తవాహన సేవలైన సూర్యప్రభవాహనం, హంసవాహనం, గజవాహన, హన్మంతవాహనం, శేషవాహన, సింహవాహన, గరుడ వాహన సేవలను ఆలయం చుట్టూ ఊరేగించారు. ఆలయ అర్చకుడు వామానాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి


వంతెన పనులను ప్రారంభిస్తున్న సురేందర్‌రెడ్డి

షాబాద్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల పరిధిలోని ఏట్ల ఎర్రవల్లి గ్రామ సమీపంలోని చిన్న వాగు వంతెన పనులను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోపాల్, నాయకులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


నందిగామ: సమ్మేళనంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు


షాబాద్: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు


నందిగామ: కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994–95లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు మండల పరిధిలోని మేకగూడ శివారులోని ఓ రిసార్ట్స్‌లో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారందరూ ఒకరికొకరు పరిచయాలు చేసుకొని, అప్పటి మధుర జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

38 ఏళ్ల తర్వాత..

షాబాద్: మండల పరిధిలోని తాళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1986–87 పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం చిట్టెంపల్లి గార్డెన్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 38 ఏళ్ల తర్వాత అందరూ ఒక్కచోట కలిసి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ఓటర్ జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి


కేశంపేట: సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు, అధికారులు

కేశంపేట: ఓటరు జాబితాపై రాజకీయ పార్టీల నాయకులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఓటర్ జాబితా, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ఇటీవల ఇచ్చిన ఓటర్ జాబితాకు అదనంగా 333 మంది కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్నారని, అదేవిధంగా ఓటరు జాబితాలో మార్పులు, చేర్పులు కూడా జరిగాయన్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల పరిధిలో 260 వార్డులు ఉన్నాయని, వీటి పరిధిలో 18,158 మంది పురుషులు, 18,480 మంది మహిళలు, ఒక్కరు ఇతరులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఎంపీఓ కిష్టయ్య, తలసాని వెంకట్‌రెడ్డి, కమ్మెకర్ నవీన్‌కుమార్, శ్రీశైలంగౌడ్, అంజనేయులు, రొల్లు రాధిక, రాఘురాంగౌడ్, లింగం, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

కొందుర్గు: స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా అన్ని రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని ఎంపీడీఓ లక్ష్మీఅనురాధ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో వివిధ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల నేపథ్యంలో అన్ని గ్రామాల్లో వార్డుల విభజన, పోలింగ్ కేంద్రాల గుర్తింపు ప్రక్రియ పూర్తయిందని, ప్రభుత్వం ఏ క్షణాన ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసినా సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లాలయ్యతో పాటు అన్ని పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో..

జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రవీన్‌కుమార్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు.